సౌకర్యాలు సమకూరుతున్నాయ్..

ఈ ఏడాది సెప్టెంబర్‌లో మున్నేరుకు వరద పోటెత్తడంతో నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల దెబ్బతింది. అక్కడ కుర్చీలు, బల్లాలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రి, రికార్డులు అన్నీ పాడై విద్యార్థులకు బోధన చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపకులు, సిబ్బందితోపాటు మరికొందరు దాతలు ముందుకొచ్చి సాయం అందిస్తుండడంతో కళాశాలలో కనీస సౌకర్యాలు ఒక్కొక్కటిగా సమకూరుతూ పూర్వవైభవాన్ని సంతరించుకుంటోంది. కాగా, కళాశాలలో మొత్తం 515మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. ఇందులో నాలుగు రెగ్యులర్ కోర్సుల్లో 277మంది, ఐదు ఒకేషనల్ కోర్సుల్లో 238 మంది విద్యార్థులు ఉన్నారు.

– ఖమ్మంసహకారనగర్



నయాబజార్ జూనియర్ కళాశాల ఆవరణలో చేరిన నీరు (ఫైల్)



నూతనంగా పూర్తయిన ప్రహరీ

కళాశాలకు దాతల ద్వారా సమకూరిన కుర్చీలు

కళాశాలలో ఏర్పాటు చేసిన బల్లలపై కూర్చున్న విద్యార్థులు

నయాబజార్ కళాశాలకు పూర్వవైభవం

- గత వరదలతో దెబ్బతిన్న కళాశాల
- రూ.8 లక్షల మేరకు దాతల సాయం
- మరమ్మతులతో పాటు చేకూరిన సామగ్రి
- మౌలిక సదుపాయాల కల్పనకు కలెక్టర్ హామీ

ముంచిన వరద..

సెప్టెంబర్ ఒకటిన వచ్చిన వరద నగరంతో పాటు ఖమ్మంరూరల్ మండలంలోని మున్నేరు పరీవాహక ప్రాంతాలను ముంచెత్తింది. దీని తాకిడికి నయాబజార్ కళాశాల మునిగి బురద మేటలు వేశాయి. దీంతో ఫైళ్లు, రికార్డులు, ఫర్నిచర్, కంప్యూటర్ మొత్తం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇందులో కొన్ని వరద ధాటికి కొట్టుకుపోయి ఫైళ్లు, సర్టిఫికెట్లు, ప్రయోగ పరికరాలు పనికిరాకుండా పోయాయి. కళాశాల ప్రహరీ కూలిపోయింది.

ఒక్కొక్కటిగా శుభ్రం చేస్తూ..

వరద ప్రభావంతో కళాశాల మొత్తం అధ్వానంగా తయారైంది. బురద పేరుకుపోవడంతో పాటు ఫర్నిచర్, ఫైల్స్‌పై బంకమట్టి పేరుకుని అందులో కొన్ని పూర్తిగా పనికిరాకుండా పోయాయి. ప్రిన్సిపాల్ ఆధ్వర్యాన కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కళాశాల గదులతో పాటు ఆవరణమంతా శుభ్రం చేశారు.

కలెక్టర్ హామీ..

దాతల సాయంతో ప్రస్తుతం కళాశాల నిర్వహణ సాఫీగా సాగుతున్నప్పటికీ.. ఇంకా పలు అవసరాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా కళాశాలకు సంబంధించి శాశ్వత సమస్యల పరిష్కారం కావాల్సి ఉంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టికి ప్రిన్సిపాల్ కె.ఎస్.రామారావు పలు సమస్యలను తీసుకెళ్లారు. దీంతో ఆయన కావాల్సిన మౌలిక సదుపాయాలపై వివరాలు తెలపాలని కోరారు. కళాశాలకు సంబంధించి తలుపులు, కిటికీలు, రంగులు, చిన్న చిన్న మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్ అడగడంతో అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ పనులు కూడా పూర్తి కానున్నాయి.

స్పందించిన దాతలు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఎందరో దాతలు స్పందించి తమకు తోచిన సాయం అందించారు. ఈనేపథ్యాన 14 ఎస్‌టైప్ కుర్చీలు, 4 మామూలు కుర్చీలు, ప్రిన్సిపాల్ చైర్, ప్రిన్సిపాల్ రూమ్‌లో ఆఫీస్ టేబుల్, రెండు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు, రెండు స్కానర్లు, సౌండ్ సిస్టమ్, ఇన్వర్టర్, 8 బల్లాలు, సీసీ కెమెరాలకు సంబంధించి 6 డీవీఆర్ బాక్స్‌లు, 18 ట్యూబ్ లైట్లు అందించబడ్డాయి. దీంతో 10 పాత బిల్లులను మరమ్మతులు చేయించగా.. రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆర్థిక సాయంతో ప్రహరీ నిర్మించారు. దాదాపు రూ.8 లక్షల మేరకు సాయం అందినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పూర్వవైభవం లభించింది..



సెప్టెంబర్‌లో వచ్చిన వరదకు కళాశాల సామగ్రి ధ్వంసమైంది. దాతలు పూర్తిస్థాయిలో సహకారం అందించడంతో కళాశాలకు పూర్వ వైభవం లభించింది. ఇంకా కొన్ని సమస్యలున్నాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దీంతో మరికొన్ని వసతులు సమకూరనున్నాయి.

– కె.ఎస్.రామారావు, కళాశాల ప్రిన్సిపాల్

క్లుప్తంగా

ఘనంగా మహా పడిపూజ



పూజలు చేస్తున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

కామేపల్లి: మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంలో శుక్రవారం గురుస్వామి మెండ్రు పుల్లయ్య, ఆరుద్ర బ్రహ్మం, భూక్యా సామ్య ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఈ పడిపూజకు తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి హాజరై పూజలు చేశాక అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గింజల నరసింహారెడ్డి, ఎర్ర నాగార్జునరావు, నల్ల మోతు లక్ష్మయ్య, రాందాస్, అర్జున్, సీతారాములు, నాగుబండి హన్మంతరావు, పెరుగు సైదులు, రామనర్సయ్య, గుప్తా శ్రీనివాస్, మహేందర్, రమేశ్, మురళి, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

మాక్ అసెంబ్లీ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సూర్య(సక్సెస్) హైస్కూల్లో శుక్రవారం 7, 8, 9వ తరగతి విద్యార్థులకు మాక్ అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ దేవరశెట్టి నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా మాక్ అసెంబ్లీ నిర్వహించామన్నారు.

సాయి మందిరంలో పవిత్రోత్సవాలు

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని శ్రీషిరిడి సాయిబాబా సేవాశ్రమం పవిత్రోత్సవ వేడుకలు ఈనెల 10 ప్రారంభం కాగా 17 వరకు నిత్య హారతీ పూజలు కొనసాగుతాయని మందిర నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి బాబా ఊరేగింపు ఉంటుందని, 17న 100 అడుగుల సాయి కోటి మహాస్తూపంలో కోటి పుస్తకాల నిక్షిప్తం చేయు వేడుకలు జరుగుతాయన్నారు.

ఘనంగా హీరో వెంకటేష్ జన్మదిన వేడుకలు

ఖమ్మంగాంధీచౌక్: సినీ నటుడు విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలను శుక్రవారం స్థానిక శ్రీనివాసనగర్‌లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘ ప్రతినిధులు తిరుమలరావు, నారుమళ్ల వెంకన్న, సైదులు, రఘు, సురేష్, హరీష్, ప్రసాద్, పవన్, వీరబాబు పాల్గొన్నారు.

'బ్లూమింగ్ మైండ్స్'లో కలర్స్ డే

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో శుక్రవారం కలర్స్‌డే వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు కలర్స్ ప్రాముఖ్యత తెలియజేసేలా ఈ వేడుకలు నిర్వహించామన్నారు. ఊదా రంగు ఆధ్యాత్మికతకు ప్రతీక అని, ధ్యానానికి ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఊదారంగు దుస్తులు ధరించి, తరగతి గదులను పువ్వులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మాదాసు వెంకన్న, అధికార ప్రతినిధిగా వడ్లమూడి హనుమంతరావులు ఏకగ్రీవంగా ఎన్నికకాగా వీరిని పలువురు సన్మానించారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని కమిటీ బాధ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తోళ్ల సురేష్, ఏపూరి వెంకటేశ్వర్లు, అశోక్, అంజయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	28	బచ్చలికూర	3
వంకాయ	24		20
బెండకాయ	38	పాలకూర	3
పచ్చిమిర్చి	26		20
కాకర	38	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	40		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	48		20
గోరుచిక్కుడు	34	మెంతికూర	2
క్యాబేజీ	24		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	38		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	64		25
క్యాప్సికం	64		

–ఖమ్మం వ్యవసాయం

పార్కులను పరిశీలించిన మేయర్



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 28, 29వ డివిజన్లలోని గోళ్లపాడు చానల్ పార్కులను మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 6 గంటల నుండే పార్కుల్లోని వాకింగ్ ట్రాక్‌ల్లో తిరుగుతూ వాకర్స్, స్థానికులతో మాట్లాడారు. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు సక్రమంగా లేవని, ఓపెన్ జిమ్‌లు పని చేయడం లేదని, సాయంత్రం వేళల్లో గుర్తు తెలియని వారు పార్కుల్లో మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని వాకర్స్ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పార్కులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వాకింగ్ ట్రాక్‌ల నిర్వాహణ చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరమ్మతులకు గురైన ఓపెన్ జిమ్ పరికరాలను బాగు చేయించాలని, సాయంత్రం వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించేలా చూడాలన్నారు. కాంట్రాక్టర్లు తమకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని కార్మికులు ఆమె దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరిస్తానన్నారు. అనంతరం లకారం ట్యాంక్‌బండ్‌ను సందర్శించి ఆదాయ వనరులను పెంచుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జల లక్ష్మి, ఉద్యాన అధికారిణి బెల్లం రాధిక, పర్యాటకశాఖ అధికారి సుమన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బేడీలు దుర్మార్గం

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ప్రజా ప్రభుత్వంలో రైతులకు బేడీలు వేయడం సరికాదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భద్రూనాయక్ అన్నారు. శుక్రవారం ఖమ్మం బీకేబజార్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఖమ్మంలో రైతులకు సంకెళ్లు వేస్తే నేడు లగచర్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు బేడీలు వేయించడం దుర్మార్గపు చర్య అన్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో వీరనారీమణుల ఆశయ సాధన జిల్లా సమితి అధ్యక్ష, కార్యదర్శులు భూక్య ఉపేంద్రాబాయి, జ్యోతి లీగల్ అడ్వైజర్ షేక్ నజీమా, జాన్‌బీ, త్రివేణి కార్యదర్శి చందు, సహాయ కార్యదర్శి విజయ, లలిత, సుభద్ర, నాగేంద్ర, అరుణ, మాధవి, ప్రియాంక, ఉష, తారాదేవి, సుజాత పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీటీసీ మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని మహ్మదాపురం మాజీ ఎంపీటీసీ ఇర్రి హేమలత (62) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందారు. మృతురాలి భర్త రిటైర్డ్ హెడ్‌మాస్టర్ ప్రసాద్ కొన్నేళ్ల క్రితం మృతిచెందగా.. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని పలువురు సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

తిరుమలాయపాలెం: విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావొద్దని నార్కొటిక్స్ ఇన్‌స్పెక్టర్ రాము అన్నారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటి డ్రగ్స్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలను సేవిస్తూ ఎవరైనా మీ ఏరియాలో ఉన్నా లేదా డ్రగ్స్‌ను అమ్ముతున్నా వెంటనే 87126 71111 లేదా టోల్ ఫ్రీ నంబర్ 1908కు తెలియజేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన నగర స్థాయి సీఎం కప్ క్రీడలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్ పటేల్‌స్టేడియంలో నిర్వహిస్తున్న నగరస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో విజేతలకు ఖమ్మం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, శిక్షకులు ఎండీ గౌస్, ఎండీ అక్బర్ అలీ, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగుపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న శోభ

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించి వైద్య సౌకర్యాలు మెరుగుపర్చాలని పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన పీఓడబ్ల్యూ ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఆస్పత్రిలోని ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని డిమాండ చేశారు. అంతేకాక అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని, డాక్టర్లు, నర్సులకు రక్షణ కల్పించాలని, టెస్టుల ధరల సూచికను బోర్డులపై ప్రకటించాలని, అనవసరమైన ఆపరేషన్లు, టెస్టులు చేయడాన్ని నియంత్రించాలన్నారు. పీఆర్వో సిస్టం అరికట్టడంతో పాటు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లపై ప్రభుత్వం నియంత్రణ ఉండాలని ఆమె డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షురాలు ఇస్లావత్ స్వాతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పీఓడబ్ల్యూ ఖమ్మం డివిజన్ కార్యదర్శి చైతన్య, వనిత, అనిత, కవిత, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి

కూసుమంచి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకులు శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇటీవల విడతల వారీగా రుణమాఫీ చేసినా.. కొందరికి మాఫీ కాలేదని, దీంతోపాటు రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలనూ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈమేరకు మంత్రి అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు మల్లెల సన్మంతరావు, ఎడవెల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు, వెంకటేశ్వరరావు, వీరారెడ్డితో పాటు చేగొమ్మ సొసైటీ చైర్మన్ బడేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

- విద్యార్థులకు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్ ఆధ్వర్యాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యలను వివరించారు. నాయకులు సాగర్, రవి,భాను తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ..



కొక్కిరేణిలో రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి తదితరులు

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. కొక్కిరేణిలో మాజీ ఎంపీపీ ఊడుగు రామయ్య, బీరోలులో గుండా ఉత్తరారెడ్డి, సుబ్లేడు మాజీ సర్పంచ్ సంజీవయ్య, పాతర్లపాడులో రామసహాయం నాగిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రాజకీయాలకు అతీతంగా ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న విక్రమ్

ఖమ్మంమయూరిసెంటర్: నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేదలందరికీ రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఖమ్మం అర్బన్ సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరుతో పదేళ్లు కాలయాపన చేసిందని, ఇప్పుడు కొత్త ప్రభుత్వంలోనైనా అర్హులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని కోరారు. ఖమ్మం పరిధిలో 20 వేల వరకు ఇళ్ల స్థలాలు లేని వారు ఉన్నారని, సర్వే చేస్తే ఈ సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. రఘునాథపాలెంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు అవి కోర్టు పరిధిలో ఉన్నాయని అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె మీరాసాహెబ్, మండల కార్యదర్శి బి.ఉపేంద్ర, నాయకులు గోవిందా, నాగేశ్వరరావు, మధు, శ్రీనివాసురావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో కార్యదర్శుల కుస్తీ..

రఘునాథపాలెం: మండలంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేసేందుకు గ్రామ కార్యదర్శులు గత వారం రోజులుగా కుస్తీపడుతున్నారు. మండలంలోని 40 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 16,300 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. 3 వేల వరకు అంటే 23శాతం పూర్తయిందని, యాప్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియతో సర్వే జాప్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో సర్వే కొనసాగుతుంది.

నేడు విద్యుత్ అంతరాయం

కామేపల్లి/రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా పలు మండలాల పరిధిలోని గ్రామాల్లో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయ ఉంటుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. ఈనేపథ్యాన కామేపల్లి మండలంలోని కొత్తలింగాల సబ్‌స్టేషన్ పరిధిలో పండితాపురం, కొత్తలింగాల, గోవింద్రాల ఫీడర్‌లోని గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతారాయం ఉంటుందన్నారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని 33 కేవీ పంగిడి ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బావోజితండా, మల్లేపల్లి, రాములుతండా, జింకలతండా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, నగరంలోని 11 కేవీ పాకబండ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మధురానగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 15 వరకు, బృందావనం వెంచర్, గొల్లగూడెం, భూమాత వెంచర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈలు కోరారు.

గురుకులంలో ప్యానల్ ఇన్‌స్పెక్షన్

నేలకొండపల్లి: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు ప్యానల్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బోధన, విద్యార్థుల ప్రగతిపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. పలు రికార్డులను తనిఖీ చేసి, భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి, హరి శ్రీనివాసరావు, గోపగాని రమేష్, పాఠశాల సిబ్బంది పాకనాటి కన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని యూపీహెచ్ కాలనీలో గల బాలాజీనగర్ ఉన్నత పాఠశాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ పరిశపుల్లయ్య 15 కుర్చీలను హెచ్ఎం సూర్యదేవర అజితకు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ.. ఈ ఏడాది కూడా పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం జిల్లా ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, షేక్ హమీద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

- నయాబజార్ విద్యార్థి..



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఖమ్మంసహకారనగర్: ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన అండర్–19 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో తమ విద్యార్థి ఎ.గోపీనాథ్ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జట్టుకు శిక్షణనిస్తున్నారని, 22 నుంచి మహబూబ్‌నగర్ జిల్లా గుండుమళ్లలో పోటీలు జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు..



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇటీవల జగిత్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–19 బేస్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు ప్రతిభ కనబర్చినట్లు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం విద్యార్థినులు అభినందించి మాట్లాడుతూ ఎ.స్రవంతి, పి.కల్యాణిలు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చగా ఈ నెల 20నుంచి రాజస్థాన్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.2వేల నగదును అందించనున్నట్లు తెలిపారు.

- కైకొండాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని..



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఖమ్మంఅర్బన్: తెలంగాణ బయోలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యాన మండల స్థాయిలో శుక్రవారం రిక్కాబజార్ పాఠశాలలో నిర్వహించిన జీవ శాస్త్ర ప్రతిభా పాటవ పోటీల్లో కైకొండాయిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.ఉష ప్రతిభ చాటుకుంది. ఖమ్మం అర్బన్ మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా ఫోరం సభ్యులు ప్రశంసాపత్రం అందించారు. ఈమేరకు శుక్రవారం పాఠశాలలో హెచ్ఎం డి.శ్రీదేవి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

- ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు..



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్

ఖమ్మంసహకారనగర్/ఖమ్మంస్పోర్ట్స్: కర్ణాటక రాష్ట్రంలోని పుత్తూరు జిల్లాలో ఇటీవల జరిగిన నేషనల్ బుడోకన్ 42వ కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు దీక్షిత, యువనీత్‌రెడ్డి, తన్వి, సంధ్య, సిద్ధు, శ్రేష్ఠ, హాన్విక, యామిని, హఫ్సాలు, సాయిప్రణమ్యలు సత్తా చాటారని పేర్కొంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిధిరాజ్‌గుప్తా, కరాటే మాస్టర్లు సాయిరేఖ, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఈనెల 15న నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఖమ్మం జిల్లా ఆటో, మోటార్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని టీయూసీఐ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మోటార్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీఏ కార్యాలయంలో యూనియన్ పేర్లతో చలామణి అవుతున్న బ్రోకర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపేందర్, లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాస్, కంకణాల శ్రీనివాసరావు, మాధవరావు, వెంకటేశ్వర్లు, భద్రయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం మృతి

ఖమ్మం సహకారనగర్: రిటైర్డ్ హెచ్ఎం, ఎస్టీయూ నాయకుడు బుడిగం సత్యం(91) శుక్రవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వెంగళరావు

నేలకొండపల్లి: ఉపాధ్యాయులపై ప్రభుత్వ నిర్లక్ష్యం వీడాలని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వెంగళరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉపాధ్యాయులకు డీఏను అందించాలని, పీఆర్‌సీ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఈ–కుబేర్‌లోని ఆర్థికపరమైన బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ కేజీబీవీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు టి.గోవిందరావు, ప్రధాన కార్యదర్శి బి.రామారావు, ఎం.చీనా, బి.రవి, నాగేశ్వరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.